సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

# మన చౌరాస్తా



మన చౌరాస్తా
Telugu News
Channel

The Complete News way

సంపుటి : 02 | సంచిక : 07 | బుధవారం | 09.04.2025



## మాటకు మాట..

## మొన్న.. బొచ్చు కుక్క.. నిన్న.. గుంట నక్క.. నేడు.. పిచ్చి కుక్క.. మరి రేపు..?

### జనగామలో కాంగ్రెస్ వరెస్స్ బీఆర్ఎస్

- పెరుగుతున్న నేతల మధ్య మాటల యుద్ధం
- 'కడియం'ను విమర్శిస్తే ఊరుకోం..
- ఎమ్మెల్యే పల్లాపై డీసీసీ కార్యదర్శి మంద రమేశ్ ఫైర్

**మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి :**

జనగామ జిల్లాలో రాజకీయాలు రోజురోజుకో మలుపు తిరుగుతున్నాయి. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య మాట యుద్ధం కాస్తా చిలికి చిలికి గాలి వానలా మారోతోంది. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్ వెళ్లిన కడియంపై పల్లా కొన్ని రోజులుగా విరుచుకు పడుతున్నారు. దీనికి కడియం శ్రీహరి సైతం కౌంటర్ ఇస్తూ వస్తున్నారు. ఇటీవల కడియం శ్రీహరి జనగామ ఎమ్మెల్యే పల్లాను కేసీఆర్ 'బొచ్చు కుక్క' అంటూ విమర్శలు చేశారు. దీనిపై ఎమ్మెల్యే 'అవును నేను కుక్కనే.. నీలాగా గుంట నక్కను మాత్రం కాదు..' అంటూ ఘాటుగా సమాధానం ఇచ్చారు. అయితే తమ అభిమాన నేత కడియంపై పల్లా చేసిన వ్యాఖ్యలకు కాంగ్రెస్ శ్రేణులు భగ్గుమంటున్నాయి. ఈ క్రమంలో జనగామ డీసీసీ కార్యదర్శి మంద రమేశ్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు.



### 'పల్లా' పిచ్చికుక్కవు కాకు..!

'జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడు.. నువ్వు ఒప్పుకున్నట్టు కాపాల కుక్క.. రేసు కుక్కవే.. కానీ.. పిచ్చికుక్కవు కాకు..' అంటూ జనగామ డీసీసీ కార్యదర్శి మంద రమేశ్ ఫైర్ అయ్యారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై కొన్ని రోజులుగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలను రమేశ్ ఖండించారు. మంగళవారం జనగామలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. 'పల్లా రాజేశ్వర్‌రెడ్డి, తాటికొండ రాజయ్య అధికారం పోయి మతి భ్రమించి మాట్లాడుతున్నరు. రాష్ట్రంలో మచ్చ లేని నాయకుడిగా ఉన్న కడియంపై లేనిపోని ఆరోపణలు చేస్తూ తమ ఉనికిని కాపాడుకోవడాడనికి చూస్తున్నరు. రాజేశ్వర్‌రెడ్డి జనగామలో ఎలా ఎమ్మెల్యే అయ్యాడో అందరికీ తెలుసు. బీఆర్ఎస్ హయాంలో అక్రమంగా సంపాదించిన డబ్బుతో ఓట్లను కొని పల్లా గెలిచిండు. పల్లా నిజమైన నువ్వు నేతవైతే రాజీనామా చేసి డబ్బులు పంచకుండా గెలువు చూద్దాం. పల్లా తమ ప్రభుత్వం రాకపోవడంతో ఖర్చు చేసిన డబ్బులు ఎలా సంపాదించాలో తెలియక మతి భ్రమించి ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నడు. కడియం శ్రీహరి భూమి కబ్జా చేశారని ఆరోపిస్తున్న పల్లా దానిని నిరూపించాలి..' అని రమేశ్ సవాల్ విసిరారు. అది నిజమని నిరూపిస్తే తమ నేత రాజీనామా చేసి మీకు గులాంగిరి చేస్తానన్నాడు.. మరి నిరూపించకుంటే పల్లా రాజేశ్వర్‌రెడ్డి రాజీనామా కడియం ఇంట్లో గులాంగిరి చేయాలని డిమాండ్ చేశారు. వాస్తవానికి పల్లా ఓ పెద్ద కబ్జాకోరని, ఆయనపై ఇప్పటికీ కోర్టుల్లో కేసులు నడుస్తున్నాయన్నారు. ఇప్పటికైనా పల్లా రాజేశ్వర్ రెడ్డి, తాటికొండ రాజయ్య తమ పద్ధతి మార్చుకోవాలని, లేకుంటే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో జనగామ మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ డి.అంజిరెడ్డి, రఘునాథపల్లి ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు రచ్చ సోమనాథ్, రఘునాథపల్లి మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జీడికంటి రాజ్‌కుమార్, యూత్ కాంగ్రెస్ నాయకులు సూర్యప్రకాశ్, మడికంటి రమేష్‌పాల్గొన్నారు.



### ఎల్ఆర్ఎస్ ప్రక్రియను స్పీడప్ చేయాలి

2

- జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా



### మిల్లర్లు రూల్స్ పాటించాలి

2

- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి



### పేద ప్రజల నడ్డి విరుస్తున్న కేంద్ర ప్రభుత్వం

3

- కొడకండ్ల మార్కెట్ చైర్‌పర్సన్ అండాలు

General News




# ఎల్ఆర్ఎస్ స్పీడప్ చేయాలి

- **25 శాతం రాయితీని సద్వినియోగించుకోవాలి**
- **ఈ నెల 14 వరకు రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుల స్వీకరణ**
- **కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**జనగామ, మన చౌరాస్తా :** ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని, ఈ నెల 14 వరకు రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పురపాలిక కార్యాలయాన్ని కలెక్టర్ రిజ్వాన్ బాషా సందర్శించి సమీక్షించారు. ఈ సందర్భంగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారుల ప్లాట్ ల క్రమబద్ధీకరణ ఆన్లైన్ విధానాన్ని నిశితంగా పర్యవేక్షించి, సంబంధిత వివరాలను అడిగి తెలుసుకొని, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలాగే రాజీవ్ యువ వికాసం పథకంలో ఇప్పటివరకు స్వీకరించిన ఆన్లైన్ దరఖాస్తుల విషయాలపై ఆరా తీశారు. జిల్లాలో లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) కింద వచ్చిన దరఖాస్తుదారుల భూముల పరిశీలనను వేగంగా చేపట్టాలని, అభ్యంతరాలు లేని వాటికి త్వరితగతిన ప్రొసీడింగ్స్ జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ రాయితీని వినియోగించుకునేలా దరఖాస్తుదారులకు చరవాణి ద్వారా మరోసారి అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెలాఖరు వరకు రాయితీ గడువును పెంచినందున దరఖాస్తుదారులు ఎల్ ఆర్ఎస్ కింద పూర్తిస్థాయి రుసుములు చెల్లించి, భూముల క్రమబద్ధీకరణ చేసుకోవాలని కోరారు. ఈ మేరకు రుసుము చెల్లించిన వారికి ప్రభుత్వం 25 శాతం రాయితీని వర్తింపజేస్తోందని, ఈ అవకాశాన్ని దరఖాస్తుదారులు వినియోగించుకొని లబ్ధి పొందాలని తెలిపారు. అనంతరం రాజీవ్ యువ వికాసం పథకం కింద దరఖాస్తు చేసుకునే లబ్ధిదారులకు ఆహార భద్రత కార్డు (రేషన్ కార్డు) ఉంటే ఆదాయ ధ్రువీకరణ పత్రం అవసరం లేదని కలెక్టర్ వెల్లడించారు. నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన రాజీవ్ యువ వికాసం పథకాన్ని నూతనంగా ప్రారంభించిందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని అమలు చేస్తోందని పేర్కొన్నారు. నిరుద్యోగులు స్వయం ఉపాధి యూనిట్లు నెలకొల్పుకొని, తమ ఆర్థికపరిస్థితిని మెరుగుపరుచుకోవాలని, యువతకు సబ్సిడీ రుణాలు మంజూరు చేసేందుకు ప్రవేశపెట్టిన ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 14వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. ఆసక్తి గల వారు ఆన్లైన్ లో https://tgobmms.cgg.gov.in లో దరఖాస్తు చేసుకొని, అందుకు సంబంధించిన ధ్రువపత్రాలను మునిసిపల్, ఎంపీడీఓ కార్యాలయల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సహాయ కేంద్రంలోనూ అందజేయాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డీఎస్సీడీఓ విక్రమ్, బీసీ సంక్షేమ అధికారి రవీందర్, టీపీఎస్ ప్రశాంతి, ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది ఉన్నారు.

# పెంచిన పెట్రో ధరలను తగ్గించాలి

**జనగామ, మన చౌరాస్తా :** పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ జనగామ పట్టణంలోని నెహ్రూ పార్క్ దగ్గర సీపీఎం ఆందోళన నిర్వహించింది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దానం చేసి నిరసన తెలిపారు. అనంతరం సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు, జనగామ పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ మాట్లాడుతూ గ్యాస్ ధర పెంచడం వలన నిత్యవసర సరుకుల ధరలు అన్ని పెరుగుతాయని, దీని వల్ల సాధారణ ప్రజలపై భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సామాన్య, పేద, మధ్యతరగతి వారు గ్యాస్ ధర చూస్తే కట్టెల పొయ్యే మేలు అనే పరిస్థితి ఉందన్నారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, భూక్య చందు నాయక్, పట్టణ కమిటీ సభ్యులు కళ్యాణం లింగం, పల్లెర్ల లలిత, బొట్ల శ్రావణ్, మంగ బీరయ్య, పాము శ్రీకాంత్, భూనాద్రి వెంకటేష్, గంగరబోయిన మల్లేష్, రాజ్, సాంబరాజు, దుర్గాప్రసాద్, కుమార్, మాదా సుధాకర్, బండ సౌందర్య, అజ్మీర సురేష్ నాయక్, లక్ష్మి, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.





# మిల్లర్లు నిబంధనలు పక్కాగా పాటించాలి

**- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి**

**జనగామ, మన చౌరాస్తా :** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మిల్లర్లు ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత నిర్వహించాలని జనగామ ఎమ్మెల్యే డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం జనగామ మండలం శామీర్ పేట గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఐకేపీ సెంటర్లు దేశంలోనే అత్యుత్తమంగా, పారదర్శకంగా కొనసాగుతున్నాయన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన అనంతరం 24 లక్షల మెట్రిక్ టన్నుల వరి కొనుగోలుతో ప్రారంభమైన ఈ ప్రయాణం 2023 నుంచి ఇప్పటి వరకు రెండు సీజన్లలో కలిపి ఒక కోటి 42 లక్షల మెట్రిక్ టన్నుల వరి కొనుగోలుకు చేరుకుందని పేర్కొన్నారు. ఒకప్పుడు ఎఫ్‌సీఐ మనకు కేవలం 3040 లక్షల టన్నుల వరకు మాత్రమే అనుమతి ఇచ్చేదని, ఇప్పుడు తెలంగాణలో పెరిగిన సాగునీటి సదుపాయాలు, విస్తీర్ణం, రైతుల కృషితో ఈ స్థాయికి ఎదిగిందన్నారు. పంజాబ్‌కు అప్పట్లో ఉన్న నీరు, కరెంట్ వంటి వనరులు ఇప్పుడు మన రాష్ట్ర రైతులకు అందుతున్నాయని, అదే మన విజయం వెనుక ఉన్న అసలైన కారణమని పేర్కొన్నారు. ప్రస్తుతం ఒక సీజన్‌లో 80 లక్షల టన్నుల వరకు వరి కొనుగోలు జరుగుతున్నదని, ఇది రాష్ట్ర ప్రగతికి నిదర్శనం అన్నారు. పంపుల వద్ద ఓఎన్‌డీఎం సిబ్బంది చేపట్టిన 34 రోజుల సమ్మెపై స్పందించారు. దీని వల్ల పరిసర ప్రాంతాల్లో పంటలు ఎండిపోయిన ఘటనను దృష్టిలో ఉంచుకుని, అవసరమైన నీరు రిజర్వాయర్లకు చేరేలా తాను ప్రత్యేకంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



# ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

బచ్చన పేట, మనచౌరస్తా : బచ్చనపేట మండలంలోని కట్కూరు, బండ నాగారం గ్రామల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు పండించిన వడ్లను ప్రభుత్వం కేటాయించిన కొనుగోలు కేంద్రాలలోని అమ్ముకోవాలని కోరారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో మొదటి రకం ధాన్యానికి రూ.2,320 ధర ప్రభుత్వం నిర్ణయించారన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నల్లనాగుల శ్వేత, పీఏసీఎస్ అధ్యక్షులు పులిగిల్ల పూర్ణచందర్, ఆర్ఐఓ శ్రీనివాస్, సీఈవో బాలస్వామి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎద్దు హరీష్, డైరెక్టర్ బేజార్టీ సిద్దులు, ఆముదాల మల్లారెడ్డి, ఇమ్మడి తిరుపతిరెడ్డి, నిమ్మ కరుణాకర్ రెడ్డి, ఇజ్జగిరి రాములు, చల్ల సురేందర్ రెడ్డి, ఆరెళ్ల భాస్కర్, ఇజ్జగిరి శ్రీనివాస్, సురేష్ రైతులు పాల్గొన్నారు.

Local News




# విద్యారంగా సమస్యలు పరిష్కరించాలి

## ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి

**జనగామ, మన చౌరాస్తా :** రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ జనగామ జిల్లా 4వ మహాసభలు స్థానిక విజయ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నూతన విద్య విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్స్, ఫీజు రీఎంబర్స్‌మెంట్లు విడుదల చేయాలని కోరారు. విశ్వవిద్యాలయాల్లో సంస్కరణల పేరుతో 'యూజీసీ' రూపొందించిన ముసాయిదా అమల్లోకి వస్తే విశ్వవిద్యాలయాలు కేంద్ర ప్రభుత్వం గుప్పిట్లోకి వెళ్తాయని, రాష్ట్రాల హక్కులను హరించడానికే కేంద్రం ప్రభుత్వం ఈ ముసాయిదా తీసుకవచ్చిందన్నారు. దీన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. సంక్షేమ హాస్టలలో అనేక సమస్యలు ఉన్న ప్రభుత్వానికి సోయిలేదని విమర్శించారు. విద్యారంగ సమస్యలకు పరిష్కారం చూపక పోతే ఉద్యమాలు ఉధృతం చేస్తామన్నారు. అనంతరం నూతన కమిటీ ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దమెర కిరణ్, రాష్ట్ర కమిటీ సభ్యులు ధర్మభిక్షం, సందీప్, జిల్లా నాయకులు సుమ, యకన్న, ఆర్య, మురళి, రమేష్, కృష్ణ, కీర్తన, హరిత పాల్గొన్నారు.

# పేదల నడ్డి విరుస్తున్న కేంద్రం

## పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి

## కొడకండ్ల మార్కెట్ చైర్ పర్సన్ అండాలు



**కొడకండ్ల, మన చౌరాస్తా :** కేంద్ర పభుత్వం పెంచిన గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని కొడకండ్ల వ్యసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ నల్ల అండాలు శ్రీరామ్ డిమాండ్ చేసింది. మంగళవారం కొడకండ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పేద ప్రజల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తూ ఐదు వందలకే గ్యాస్ సిలిండర్ అందిస్తుంటే.. కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల పట్ల వివక్ష చూపుతూ ధరలు పెంచుతుందన్నారు. దేశవ్యాప్తంగా పేద ప్రజలపై వందల కోట్ల రూపాయల భారాన్ని మోపి వచ్చిన డబ్బుతో ఏం చేయాలనుకుంటుందో చెప్పాలని ఆమె డిమాండ్ చేసారు. గత పన్నెండెండ్లు గా బీజేపీ ప్రభుత్వం పేద బడుగు బలహీన వర్గాలకు ఒక్క పథకం కూడ ఏర్పాటు చేయకపోగా ధరలు పెంచుతూ పేదవాడిపైన ప్రతాపం చూపిస్తుందన్నారు. గ్యాస్ ధరలు పెంచి పేదవాడిపై గుది బండ మోపినట్టుందని ఆమె అన్నారు. పెంచిన ధరలు వెంటనే తగ్గించకుంటే పేద ప్రజల పట్ల పోరాటం చేస్తామన్నారు. సన్న బియ్యం పథకాన్ని రేవంత్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తే తామే అమలు చేస్తున్నామని గొప్పలు చెప్పుకోవడం బీజేపీ నాయకుల దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. సమావేశంలో మార్కెట్ డైరెక్టర్లు దేశగాని నాగరాజు, బత్తుల వెంకన్న, గిరగాని క్రాంతికుమార్, నారెడ్డి వెంకట్ రెడ్డి, బానోత్ యాకుబ్, నాయకులు భూక్యా వీర్య నాయక్, దారావత్ రవి, హుస్సేన్ పాల్గొన్నారు.

# 108 పైలట్లకు ఉత్తమ కేఎంపీల్ అవార్డు

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లా 108 వెహికల్ లో పనిచేసే పైలెట్స్ ఉత్తమ కేఎంపీఎల్ అవార్డు అందుకున్నారు. అంబులెన్స్ లో క్షతగాత్రులను సకాలంలో, హాస్పటల్ కు చేరుస్తూ, వాహనానికి సకాలంలో మరమ్మతులు , షెడ్యూల్ సర్వీస్ , డీసెల్ టాపప్, ఎయిర్ చెకింగ్ చేయిస్తూ, వాహనానికి మంచి మైలేజి తెచ్చినదుకు మంగళవారం జనగామ ప్రోగ్రాం మేనేజర్ ఎస్కే నసీరుద్దీన్, జిల్లా కోఆర్డినేటర్ మండ శ్రీనివాస్ చేతుల మీదుగా పైలెట్లు కె.రాజన్న, జి.అనిల్ అవార్డు అందుకున్నారు.



# గౌడ మహిళలను అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలి



**యాదాద్రి భువనగిరి, మన చౌరాస్తా :** నిజామాబాద్ జిల్లా అర్మూర్ డివిజన్ పరిధిలోని ఎర్రగట్ల మండలం తాళ్లపల్లిలో శ్రీరామ నవమి గౌడ కుటుంబ మహిళలు గుడికి వెళ్తే వారిని అవమానించిన వీడీసీ సభ్యులు, పూజారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పిఎస్ రాష్ట్ర నాయకుడు, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు నల్ల చంద్రస్వామి మాదిగ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తాళ్ల రాంపూర్ గ్రామంలో గౌడ గీత కార్మికుల బతుకులు ఆందోళనకరంగా మారినాయన్నారు. ఊర్లో కల్లు అమ్మాలన్నా, ఇతర నిత్యవసర సరుకులు అమ్ముకోవాలన్నా, ఏ పని చేయాలన్నా వీడీసీలకు మాముళ్లు ఇవ్వాల్సిందే అని లేకుంటే కుల బహిష్కరణ, గ్రామ బహిష్కరణలు చేసి జరుమానా విధిస్తూ రాక్షసానందం పొందుతున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.




# ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రం ఏర్పాటు

**జనగామ రూరల్, మన చౌరాస్తా :** వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రం ఏర్పాటు చేసినట్టు గ్రామ యువనాయకుడు ఆవుల ప్రశాంత్ రెడ్డి తెలిపారు. జనగామ మండలంలోని పెంబర్తి హైవేపై ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో రేపాల కోటేశ్వర్ రావు, గురిజాల కొండల్ రెడ్డి, బాల్దే మహేష్ , మేకల గిరి, గండి కోట మధు, బాల్దే కుమార్, బాల్దె అశోక్, అంబాల సతీష్, ఎదు కళ్యాణ్, విఘ్నేష్, వంచ భాస్కర్ రెడ్డి, ఎడ్ల నరేష్ రెడ్డి, ఇట్టబోయిన రవి తదితరులు పాల్గొన్నారు.



# వృద్ధులకు అన్నదానం

**జనగామ రూరల్, మన చౌరాస్తా :** కాన్రాజు ఉదయశ్రీ పుట్టిన సందర్భంగా తల్లిదండ్రులు కాన్రోజు నాగలక్ష్మి, రవి ఆధ్వర్యంలో శామీర్ పేట రుద్రమదేవి ఓల్డ్ ఏజ్ హోమ్ లో అన్నదానం, బియ్యం, నిత్యవసర సరుకులు, అరటి పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్, ముఖ్య సలహాదారుడు వంగ భీమ్ రాజు మాట్లాడుతూ అమ్మ ఫౌండేషన్ ఆలోచన ఆశయంలో పాల్గొని ఉదయశ్రీ పుట్టిన రోజు సందర్భంగా అన్నదానం చేసిన తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రమేష్ కుర్మ, రుద్రమదేవి ఆశ్రమ నిర్వాహకులు దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



# రెడ్ డ్రెస్‌లో శ్రుతి

ప్రముఖ సీనియర్ నటుడు కమల హాసన్ కుమార్తె శ్రుతి హాసన్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అందానికి పెట్టింది పేరు ఈ ముద్దుగుమ్మ. తాజాగా ఈ బ్యూటీ రెడ్ డ్రెస్ లో తన ఘాటైన అందాలతో కుర్రకారుకు నిద్రలేకుండా చేస్తుంది. ప్రస్తుతం ఈ ఫొటోలు నెట్టింట్లో తెగ వైరల్ అవుతున్నాయి. బ్యూటీ శ్రుతి హాసన్ గురించి ఎంత చెప్పినా తక్కువే. అందం, అభినయం ఈ ముద్దుగుమ్మ సొంతం. సింగర్ గా, నటిగా తన అద్భుతమైన యాక్టింగ్ తో మంచి గుర్తింపు సొంతం చేసుకుంది. అనగనగా ఓ ధీరుడు మూవీతో తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగు పెట్టిన ఈ బ్యూటీ, మొదటి సినిమాతోనే మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఇక ఈ మూవీ తర్వాత ఈ అమ్మడుకు వరసగా అవకాశాలు వచ్చాయి. ముఖ్యంగా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ గబ్బర్ సింగ్ మూవీతో ఓవర్ నైట్ ఈ అమ్మడు స్టార్ హీరోయిన్ స్టేటస్ అందుకుంది. తర్వాత వరసగా ఛాన్స్ లు కొట్టేసి టాలీవుడ్ నే షేక్ చేసింది ఈ ముద్దుగుమ్మ. ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే ఈ చిన్నది ఎప్పుడూ తన గ్లామర్ ఫొటోస్ తో కుర్రకారును మాయ చేస్తూ ఉంటుంది. తాజాగా ఈ అందాల ముద్దుగుమ్మ రెడ్ డ్రెస్ లో తన అందంతో మతిపోగొడుతుంది. ప్రస్తుతం ఈ ఫొటోస్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.